క్లుప్తంగా

మేడేను అంబేడ్కర్ మేడేగా జరపాలి

ఒంగోలు వన్‌టౌన్: మేడేను అంబేడ్కర్ మేడేగా జరపాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక చట్టాల రూపశిల్పి అంబేడ్కర్‌కు కమ్యూనిస్టు పార్టీలు నివాళులర్పించాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. బ్రిటిష్ ప్రభుత్వంలో 1942–46 మధ్య లేబర్ కమిషన్ సభ్యుడిగా పనిచేసిన సమయంలో అంబేడ్కర్ కార్మికుల కోసం అనేక చట్టాలను పోరాడి సాధించాడన్నారు.

మత్స్యకారులకు భృతి పంపిణీ

కొత్తపట్నం: మండలంలో ఉన్న మత్స్యకారులకు మత్స్యకార భృతిని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు పంపిణీ చేశారు. మంగళవారం కె.పల్లెపాలెం గ్రామంలో మంగళవారం మత్స్యకార భరోసా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 1,469 మందికి మత్స్యకార భృతి ఇచ్చామన్నారు. 49 మందికి భృతి రాకపోవడంతో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మత్స్యకార జేడీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో సుభాని, శ్రీను, ప్రభుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్య

సంతనూతలపాడు: విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు సంతనూతలపాడు గ్రంథాలయశాఖ అధికారి కే.సత్యనారాయణ పేర్కొన్నారు. సంతనూతలపాడులోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు రెండో రోజు జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జూన్ 6వ తేదీ వరకు శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శిబిరానికి పంపించి వారిని మరింతగా చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా కోచింగ్

మద్దిపాడు: మండలంలోని మార్రెళ్లకుంట పాలెం సమీపంలో ఉన్న ఆసరా సంస్థ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి పిల్లలకు నెల రోజుల పాటు ఇంగ్లిష్, గణితం సబ్జకుల్లో ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్లు ఆసరా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి మే 1వ తేదీన 9.30 గంటలకు ఆసరా కేంద్రం వద్ద హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం



● ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్

దర్శి (కురిచేడు): జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన దర్శిలో సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2025–26 ఎస్సీ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో 1305 మందికి రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. 21 ఏళ్ల నిండి 50 ఏళ్ల లోపు వారు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రుణాల కోసం మే 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, వైట్ రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని ఈడీ కోరారు.

పాఠశాల విద్యను బలహీనం చేస్తున్న ప్రభుత్వం

● పాఠశాల విద్యలో మార్పులు చేయడం తక్షణమే ఆపేయాలి
● కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు
● ఎస్ఎఫ్ఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ధ్వజం



మాట్లాడుతున్న రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ గోపాలరెడ్డి, పక్కన నాయకులు

ఒంగోలు సిటీ: పాఠశాల విద్యను కూటమి ప్రభుత్వం బలహీనం చేస్తోందని.. పాఠశాల విద్యలో మార్పులు చేయడం తక్షణమే ఆపేయాలని రిటైర్డు జాయింట్ డైరెక్టర్ గోపాలరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధమైన 117 జీవో రద్దు చేయాలన్నారు. దాని స్థానంలో మార్పులతో తీసుకువచ్చిన నూతన విధానం కూడా అసంబద్ధంగానే ఉందని దీనిని కూడా తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలహీనం చేసే ప్రక్రియను నిలిపివేయాలని, ఎలిమెంటరీ స్కూళ్లను రెండు భాగాలుగా విడదీయాలనే ఆలోచన మానుకోవాలని చెప్పారు. సీబీఎస్సీ సిలబస్ కాకుండా స్టేట్ సిలబస్ అమలు చేయాలని కోరారు. ప్రతి క్లాస్‌కు ఒక టీచర్ ఉండేలా, ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించి అదనంగా టీచర్‌ను కేటాయించాలని కోరారు.

పేదలకు విద్యను దూరం చేసే దిశగా కుట్ర..

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కొండారెడ్డి మాట్లాడుతూ పేదలను వెనకబడిన ప్రాంత ప్రజలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని కోరారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఈ నిర్ణయాలు నష్టదాయక ఫలితాలు ఇస్తాయని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ 10 ప్లస్ 2 పాఠశాలల అభివృద్ధికి సరైన ప్రణాళిక ఉండాలని, ప్రభుత్వం దృష్టి సారించి ఈ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, ప్లస్ టూకు ప్రత్యేక ప్రిన్సిపాల్‌ను కేటాయించాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం కోసం అందరం కలిసి పోరాటాలు చేయాలన్నారు. ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుంటుందని, ప్రైవేటు విద్యాసంస్థలకు కార్పెట్ పరుస్తోందన్నారు.

బాలికలు చదువుకు దూరం అవుతారు..

యూటీఎఫ్ సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చే మార్పులు వలన బాలికలు చదువుకు దూరం అవుతారన్నారు. నిరక్షరాస్యత పెరుగుతుందని వీటిపై సమగ్రమైన చర్చ జరగాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి మాట్లాడుతూ పాఠశాల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమం నడపాలని అది అందరి బాధ్యత అని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అసంబద్ధమైన 117 జీవోను, దానికి సవరణ పేరుతో చేస్తున్న మార్పులను తక్షణమే నిలిపివేయాలని తీర్మానించారు. 8 రకాల స్కూలు ఆమోదంపై సమగ్రమైన అభిప్రాయ సేకరణ జరిపి, గ్రామ సభల్లో ఆమోదం చేయాలన్నారు. 10 ప్లస్ 2 పాఠశాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళిక ఉండాలని, దానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, సవరణ పేరుతో ఏ స్కూలు మూత వేయకూడదని తీర్మానాలు చేశారు. చేసిన తీర్మానాలు అమలు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె. విజయ్, పాండురంగారావు, నాయకులు దేవా, విజయ్, తేజ పాల్గొన్నారు.

ఉచిత విద్య కోసం దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: విద్యాహక్కు చట్టం అనుసరించి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న బలహీన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 1వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి డి.వెంకారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పేదరికం చదువుకు ఆటంకం కాకూడదన్నా ప్రభుత్వ లక్ష్యాన్ని అనుసరించి ఇందుకోసం కనీసం 25 శాతం సీట్లు బలహీనవర్గాల పిల్లల కోసం కేటాయించినట్లు చెప్పారు. 2025–26 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో 1వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంధులు, హెచ్‌ఐవీ బాధితులు, ఆర్థికంగా వెనుకబడిన బీసీ, ఎస్టీ, ఎస్సీ, ఓసీ, మైనార్టీ వర్గాలు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వారైతే రూ.1.20 లక్షల వార్షిక ఆదాయం మించకూడదని, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షల ఆదాయం కలిగి ఉండాలని తెలిపారు. సీబీఎస్ఈ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలంటే 2 ఏప్రిల్ 2019 నుంచి 31 మార్చి 2020 మధ్య జన్మించి ఉండాలని, ఐదు సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలలో దరఖాస్తు కోసం 2 ఏప్రిల్ 2019 నుంచి 31 మే 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. తల్లిదండ్రులు తగిన ఆధారాలను సీఎస్ఈఏపీ. జీవోవి. ఇన్ వెబ్ సైట్ ద్వారా, సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా ఇంటర్నేట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 2 నుంచి మే 19 మధ్య ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుంటారని ప్రకటనలో తెలిపారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీ



వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

మద్దిపాడు: గ్రానైట్ ఫ్యాక్టరీలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈఘటన మంగళవారం మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లోని వినీల గ్రానైట్ ఫ్యాక్టరీలో చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. ఈనెల 26వ తేది ఎప్పటిలాగే యజమాని హరిబాబు ఫ్యాక్టరీలో పని చూసుకొని ఇంటికి వెళ్లాడు. అయితే రెండు రోజుల నుంచి వెళ్లలేదు. ఈక్రమంలో దొంగలు ఫ్యాక్టరీలోకి ప్రవేశించి లోపల ఉన్న బీరువాను తెరిచి దానిలో ఉన్న రూ.7 వేల నగదు, హాలులో ఉంచిన రెండు విలువైన మోటార్లు, చైన్ పుల్లర్, స్టీల్ సామగ్రిని ఎత్తుకు పోయారని ఫ్యాక్టరీ యజమాని హరిబాబు మంగళవారం ఉదయం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌కు సమాచారం అందించగా వారు ఘటన జరిగిన ప్రాంతంలో వేలిముద్రలు సేకరించారు. పోయిన వస్తువుల ఖరీదు రూ.లక్షకు పైనే ఉంటుందని యజమాని వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.8.27 కోట్ల పనులకు తీర్మానం

● ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి



ఉపాధి పనుల తీర్మానం ఇస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి

కొత్తపట్నం: ఉపాధి కూలీలకు పని కల్పించడం కోసం 172 పనులకు గాను రూ 8.27 కోట్లు అవసరమని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో శ్రీకృష్ణ, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో కొక్కిలగడ్డ నాగరాజు, ఈసీ శివకృష్ణ, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చెరువుల్లో మరమ్మతులు, పొలం చుట్టూ కందకాలు, పంట కాలవలు పూడికలు తీసుకోవడానికి తీర్మానం చేశామన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువులు, నాగార్జున సాగర్ కాలువల్లో పూడికలు తీయాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఎన్ఆర్‌జీఎస్ ద్వారా 90 రోజులు కూలి పనులు చేసుకోవాలన్నారు. అంతేకాక పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో 1,426 గృహాలు మంజూరు కాగా సొంత స్థలాల్లో 711, జగనన్న కాలనీలో 715 నిర్మాణాలు చేపట్టారన్నారు. మొదలుపెట్టనవి 216, బేస్‌మెంట్ లెవల్‌కు 318, రూఫ్‌లెవల్ 94, శ్లాబ్ వేసినవి 8, పూర్తి అయిన గృహాలు 726 ఉన్నాయన్నారు. ఎన్‌టీఆర్ గృహాలు 2014 నుంచి 2019 వరకు 961 గృహాలు వివిధ దశలో ఆగి ఉన్నాయన్నారు. మొత్తం రూ.1.87 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జూన్ నాటికి గృహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

క్షయ వ్యాధిగ్రస్థులు ఆరు నెలలు చికిత్స పొందాలి

దొనకొండ: క్షయ వ్యాధిగ్రస్థులు 6 నెలలు తప్పకుండా చికిత్స పొందాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, క్షయ వ్యాధి నియంత్రణాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. మంగళవారం మండలంలోని కట్టకిందపల్లి, నారపురెడ్డిపల్లి, రుద్రసముద్రం గ్రామాలకు చెందిన కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు చికిత్స అందించారు. ఆమె వ్యాధిగ్రస్థుల ఇంటి వద్దకు వెళ్లి వారికి అందుతున్న సేవలపై సమీక్షించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి 6 నెలల పాటు బలమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. 2030 సంవత్సరం నాటికి ఇండియాను క్షయవ్యాధి రహిత దేశంగా చేయాలన్న లక్ష్యంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి అన్వేష్‌కుమార్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్ అలెగ్జాండర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతంలో కార్యకర్తల కృషి



పేర్నమిట్టలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ హేమ సృజన

సంతనూతలపాడు: అంగన్‌వాడీల బలోపేతంలో కార్యకర్తలు మరింత కృషి చేయాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డీఎస్ హేమ సృజన పేర్కొన్నారు. మండలంలోని పేర్నమిట్టలోని 1,2,5,6, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు శాంతినగర్ కేంద్రాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. పౌష్టికాహారం, స్నాక్, భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా హేమసృజన మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కార్యకర్తలు, టీచర్లు నడుం బిగించాలన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను, అంగన్వాడీ కేంద్రాల అభ్యున్నతికి పాటుపడాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కో చైర్మన్‌గా ప్రకాశరావు



నియామకపత్రాన్ని అందుకున్న ప్రకాశరావు (కుడివైపు)

ఒంగోలు టౌన్: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కో చైర్మన్‌గా జిల్లాకు చెందిన మాంటిస్సోరి ప్రకాశరావును నియమించారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. కో చైర్మన్‌గా ఎంపికైన ప్రకాశ్‌రావుకు అసోసియేషన్ జిల్లా నాయకులు, ప్రైవేటు కరస్పాండెంట్లు, స్కూలు డైరెక్టర్లు, స్కూలు ప్రిన్సిపాళ్లు అభినందనలు తెలిపారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

పెద్దారవీడు: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేస్తే భూమిని పది రెట్లు ఎక్కువ సారవంతం చేస్తుందన్నారు. జీలుగులు విత్తనాలు 10 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,230 ఉండగా సబ్సిడీ రూ.615 రైతు వాటా రూ.615, జనుము విత్తనాలు 10 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,090 ఉండగా సబ్సిడీ రూ.545 రైతు వాటా రూ.545, పిల్లి పెసర 8 కిలోలు సంచి పూర్తి ధర రూ.1,440 ఉండగా సబ్సిడీ రూ.720 రైతు వాటా 720 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి హోమం



ఉత్సవమూర్తుల అభిషేకంలో పాల్గొన్న భక్తులు

● వైభవంగా అభిషేకోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా మంగళవారం మహాగణపతిహోమం రుత్వికులు చిమట కార్తీక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట అభయ ఆంజనేయస్వామి మూల విగ్రహమూర్తికి, జంట నాగులు శిలలు, బలిపీఠంకు, అనంతరం సీతా, రామ, లక్ష్మణ, హనుమంత ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం నూతనంగా ప్రతిష్ఠించనున్న మూల విగ్రహమూర్తులకు, నూతన ఉత్సవ విగ్రహ మూర్తులకు భజంత్రీల మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణాసంచా నడుమ కన్నుల పండువగా గ్రామోత్సవం సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా దాతలు భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లు, బాణసంచా దుకాణాల తనిఖీ



బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న డీటీ అజయ్‌కుమార్ రెడ్డి



చీమకుర్తిలో పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని బాణసంచా దుకాణాన్ని పెట్రోలు బంక్‌ను, రైస్ మిల్లును, గ్యాస్ గోడౌన్‌ను, ఆర్ఓ ప్లాంట్‌ను డిప్యూటీ తహశీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఏడీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ఆయా ప్రాంతాలలో నిబంధనల మేరకు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా అన్న అంశాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వారి వెంట ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ సుధాకర్, ఆయా వ్యాపారులు వారి వెంట పాల్గొన్నారు.

జేసీ ఆకస్మిక తనిఖీ..

చీమకుర్తి: జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మంగళవారం ఆకస్మికంగా చీమకుర్తి ఎఎన్‌ఎస్పీ కాలనీ సమీపంలోని భారత్ పెట్రోలియం బంక్‌ను పరిశీలించారు. బంక్‌లోని ధరల పట్టిక లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వినయోగదారులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శాంతిప్రియ ఆధ్వర్యంలో బంగారమ్మతోపు, దిన్నేపురం, పిడతలపూడి రోడ్డులోని రేషన్ షాపుల దుకాణాలను పరిశీలించారు.

భూసార పరీక్షలతో పెట్టుబడుల నియంత్రణ

దర్శి (కురిచేడు): రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయిస్తే పంటలకు అవసరమైన పోషకాలు తగిన మోతాదులో ఉపయోగించవచ్చని, దీంతో పెట్టుబడులు తగ్గించవచ్చని ఏఓ వి.బాలకృష్ణ నాయక్ తెలిపారు. మండలంలోని వెంకటాచలంపల్లిలో మంగళవారం ఆయన భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరించే విధానంపై అవగాహన కలిగించారు. భూసార పరీక్షలతో రైతులు తమ పంట పొలంలోని పోషక విలువలు తెలుసుకుంటే వేసిన పంటకు ఏయే పోషకాలు ఎంతెంత మోతాదులో అవసరమో తెలుసుకొని తగిన మోతాదులో ఎరువులు వాడవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందొచ్చని తెలిపారు. ప్రతి రైతు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మట్టి నమూనా పరీక్షించే యాప్‌లో నమోదు చేసుకోవాలని, రైతుతో పాటు నమూనా తీసే ప్రదేశాన్ని ఫొటో తీసుకోవాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. మట్టి నమూనా తీసే క్రమంలో గతంలో ఆ పొలంలో వేసిన పంట గురించి రాబోయే కాలంలో వేసే పంట గురించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ ఏడాది మండలంలోని 23 రైతు సేవా కేంద్రాల్లో 1280 మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా తమ పొలంలోని మట్టి నమూనాలు సేకరించేందుకు సహకరించాలని, భూమి పోషక విలువలు తెలుసుకోవాలని, మట్టి నమూనాల ఆధారిత ఎరువులు వేయాలని, మట్టి నమూనాలతో సరైన పంట తెలుసుకొని వేయాలని కోరారు. మండలంలోని ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

దొనకొండలో..

దొనకొండ: గ్రామాల్లో రైతులు తమ పొలాల్లో అధిక దిగుబడులు పొందాలంటే భూసార పరీక్షలు కీలకమని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో 779 మట్టి నమూనాలను తమ సిబ్బందితో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాలు నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలు జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర లభ్యత ఎంత వరకు ఉన్నాయో సాగు చేయబోయే ముందు ఏ ఎరువులు ఎంత మోతాదులో వేయాలో తెలుసుకోవాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరన్నారు. రైతులు ఈ విషయాలను గమనించి సిబ్బందిని సంప్రదించి మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.